ప్రజాశక్తి
బుధవారం 12 జూన్ 2024 8 పేజీలు
చిత్తూరు





నేడు 'చంద్రా'భిషేకం

- నాలుగోసారి ప్రమాణస్వీకారం
- ప్రతిపక్షంలో 15ఏళ్లు
- నారావారిపల్లి- ఢిల్లీ వరకూ చంద్రబాబు రాజకీయ ప్రస్థానం
- నేడు కుటుంబ సమేతంగా తిరుమలకు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

సాధారణ రైతు కుటుంబంలో జన్మించిన నారా చంద్రబాబునాయుడు నారావారిపల్లి నుంచి ఢిల్లీ వరకూ రాజకీయ ప్రస్థానం సాగించారు. 28ఏళ్ల వయస్సులోనే మంత్రిగా అసెంబ్లీలో అడుగుపెట్టిన నారా చంద్రబాబునాయుడు మూడుసార్లు ప్రమాణస్వీకారం చేసి, నాలుగోసారి నేడు బుధవారం చేయనున్నారు. 1995, 1999లలో ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా చేశారు. ఆ తరువాత 2014లో నవ్యాంధ్రకు తొలి ముఖ్యమంత్రిగా చేశారు. 2024 ఎన్నికల్లో అత్యధిక సీట్లు సాధించి ఎన్డీఏ కూటమి సిఎం అభ్యర్థిగా బుధవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. 15ఏళ్ల పాటు ప్రతిపక్ష నేతగానూ ఉన్నారు. కేంద్రంలోని యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వానికి కీలకంగా ఉన్నారు. 1996లో అప్పటి ఎన్డీఏ కూటమికి కన్వీనర్‌గా ఉంటూ అప్పటి ప్రధాని వాజ్‌పేయికి ప్రధాన సలహాదారుగానూ ఉన్నారు. ఈసారి ఎన్డీఏ తరపున కీలకంగా వ్యవహరించనున్నారు.

సామాన్య రైతు కుటుంబంలో జన్మించి..

చంద్రగిరి మండలం నారావారిపల్లిలో ఓ సామాన్య రైతు నారా ఖర్జూరనాయుడు, అమ్మణ్ణమ్మ దంపతులకు మొదటి సంతానం నారా చంద్రబాబునాయుడు. 1950, ఏప్రిల్ 20న జన్మించారు. తమ్ముడు నారా రామ్మూర్తినాయుడు చంద్రగిరి ఎంఎల్ఎగా 1994లో ఉన్నారు. ఓ చెల్లిని తన ఊరికి పక్కనే ఉన్న కందులవారిపల్లిలో సొంత

2లో

అమరనాథ్‌రెడ్డికే ఛాన్స్

- తొలి మంత్రివర్గంలో ఖరారైనట్లే
- ఎంఎల్‌సి కోటాలో కంచర్ల శ్రీకాంత్‌కూ





ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు అమరావతిలో బుధవారం ఉదయం 11.30 గంటలకు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ముఖ్యమంత్రితో పాటు 25 మంది మంత్రులను ప్రకటించనున్నారు. టిడిపి, జనసేన, బిజెపి కూటమిలో 164 స్థానాలు రావడంతో సంఖ్య రీత్యా 26మందికి పైగా ఇవ్వరాదు. మేజిక్ ఫిగర్ మేరకు ముఖ్యమంత్రి సహా 26 మందికే మంత్రివర్గ విస్తరణలో చోటు లభించనుంది. టిడిపి తరపున చాలామంది సీనియర్లు గతంలో మంత్రులుగా ఉన్నవారూ ఉన్నారు. గతంలో ఉన్న ఉమ్మడి 13 జిల్లాల వారికే తొలివిడత మంత్రి పదవులు ఇవ్వాలని టిడిపి అధినేత నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ లెక్కన జనసేనకు 5, బిజెపికి రెండు, మిగిలినవి టిడిపి వారిని ప్రకటించనున్నారు. ఈనేపథ్యంలో పలమనేరు ఎంఎల్ఎ ఎన్.అమరనాథరెడ్డికి చోటు లభించే అవకాశాలు మెండుగా ఉన్నాయి. లోకేష్ జరిపిన యువగళం పాదయాత్రలో రాయలసీమవ్యాప్తంగా వెనకంటే ఉండి విజయవంతం అయ్యేలా అమరనాథరెడ్డి కృషి చేశారు. పైగా సీనియర్‌గానూ ఉన్నారు. గతంలో మంత్రిగా చేసిన అనుభవం ఉంది. ఈ నేపథ్యంలో ఆయనకే ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలుస్తోంది. అలాగే కుప్పం ఇన్‌ఛార్జిగా ఉన్న ప్రకాశం, చిత్తూరు, నెల్లూరు జిల్లాల నుంచి ఎంఎల్‌సి గెలుపొందిన కంచర్ల శ్రీకాంత్‌కూ ఎంఎల్‌సి కోటాలో మంత్రి పదవి వచ్చే అవకాశం లేకపోలేదు.

'వాగులు, చెరువులను కాపాడండి'



ప్రజాశక్తి- గుడిపల్లి : మండలం సర్వసభ్య సమావేశం మంగళవారం తూతూ మంత్రంగా నిర్వహించారు. ఈ సమావేశంలో గుండ్లసాగరం పంచాయతీ నక్కనపల్లి రెవెన్యూ గ్రామంలోని వాగులు, వంకలు, చెరువులు ఆక్రమణకు గురయ్యాయని స్థానిక సర్పంచ్ నాగరాజు ఆరోపించారు. ఆయన మాట్లాడుతూ నక్కనపల్లి రెవర్యూ గ్రామంలోని చెరువులు, వంకలు, వాగులను వైసీపీ ప్రభుత్వ హయాంలో లేఅవుట్లు ఏర్పాటు చేసుకొని దర్జాగా ప్రభుత్వ భూములను కబ్జా చేసుకుంటున్నా రెవెన్యూశాఖ నిద్రావస్థలో ఉందని అన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వీటిపై చర్యలు తీసుకొని ప్రభుత్వ భూములను కాపాడాలని కోరారు. కొడతనపల్లి సర్పంచ్ వెంకటేష్ మాట్లాడుతూ తమ గ్రామపంచాయతీలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో అవకతవకలు జరుగుతున్నాయని, సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండండి

జిల్లా పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ ప్రభాకర్



ప్రజాశక్తి- కార్వేటినగరం: తొలకరి వర్షాల్లో వ్యాపించే వ్యాధుల పట్ల పశువైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా పశుసంవర్ధశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ ప్రభాకర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పశు వైద్యశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు మాట్లాడుతూ వర్షాకాలంలో పశువులకు సోకే గొంతువాపు, జబ్బవాపు, చిటుకు వ్యాధులు వంటి ప్రాణాంతకమైన వ్యాధులపై పాడి రైతులకు అవగాహన కల్పించే వాటికి సంబంధించిన వ్యాక్సిన్లు వేయాలని సూచించారు. పశువులు మరణించకుండా తగు జాగ్రత్తలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జూన్, జూలై నెలల్లో వ్యాపించే వ్యాధులు చాలా ప్రమాధకరమని తెలిపారు. అనంతరం కార్యాలయంలోని రికార్డులను పరిశీలించి, సిబ్బంది యొక్క పనితీరుపై సంతప్తిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ హేమకుమార్, పశువైద్య సిబ్బంది రమేష్, పలువురు పాల్గొన్నారు.

'పారిశుధ్యం పట్ల శ్రద్ధ వహించాలి'

ప్రజాశక్తి- సోమల: ఆశ కార్యకర్తలు తమ పరిధిలోని గ్రామాలలో పంచాయతీ వారి సహకారంతో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పెద్ద ఉప్పరపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య అధికారులు సోనియా, బాలాజీ తెలిపారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా కార్యకర్తలతో ఆశాడే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షం కారణంగా మురికి నీరు నిల్వ ఉండి అందులో దోమలు వద్ధి చెంది ప్రజలను కుట్టి అనారోగ్యం పాలు చేసే అవకాశం ఉందని, కనుక ముందుగానే మురుగునీటి కాలువలను పరిశుభ్రంగా ఉంచడం, పేడ దిబ్బలు వ్యర్థాలను గ్రామాలకు దూరంగా ఉంచడం, సాయంత్రం వేళల్లో ఇండ్లలో వేపాకు పొగ వేసుకోవడం, దోమతెరలు వాడడం లాంటి సురక్షిత కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

(మొదటి పేజీ తరువాయి)

నేడు 'చంద్రా'భిషేకం

బావ కనుమూరి చంద్రబాబు నాయుడుకు ఇచ్చారు. ఆ తరువాత మరో చెల్లెల్ని కృష్ణా జిల్లా శ్రీనివాస చౌదరికి ఇచ్చారు. నారావారిపల్లిలో స్కూలు లేకపోవడంతో పక్కనే ఉన్న శేషాపురంలో ప్రాథమిక విద్య అభ్యసించారు. 6-9 వరకూ చంద్రగిరి మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర హైస్కూల్లో ఉన్నారు. 10 నుంచి తిరుపతి ఎస్వీ హైస్కూల్లో విద్యాభ్యాసం చేశారు. ఎస్వీ ఆర్ట్స్ కాలేజీ, ఎస్వీ యూనివర్సిటీల్లో డిగ్రీ, పీజీ పూర్తి చేశారు. ఎంఎ ఎకనామిక్స్ చదివిన చంద్రబాబునాయుడు స్టూడెంట్ యూనియన్‌కు లీడర్‌గా ఉన్నారు. 1972లో యువజన కాంగ్రెస్ లీడర్‌గా ఉంటూ రాజకీయ అరంగేట్రం చేశారు. అప్పట్లో ఢిల్లీలో జరిగిన ఎన్ఎస్‌యుఐలో ఓ సెమినార్‌లో కీలకంగా ప్రసంగించడంతో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ మెచ్చుకుని రాజకీయాల్లోకి ఆహ్వానించారు. 1978లో చంద్రగిరిలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున పోటీచేసి విజయం సాధించారు. పిన్న వయస్సులోనే సినీ ఆటోగ్రఫీ మంత్రిగా, యువజన క్రీడా శాఖా మంత్రిగా కాంగ్రెస్ అవకాశం ఇచ్చింది. అప్పట్లోనే ఎన్టీఆర్ సినిమా రంగంలో ఉండడంతో ఎన్టీఆర్‌కు దగ్గరయ్యారు. 1981లో ఎన్టీఆర్ కూతురు భువనేశ్వరిని ఇచ్చి అల్లున్ని చేసుకున్నారు. అయితే 1983లో చంద్రగిరిలో కాంగ్రెస్ తరపునే పోటీ చేశారు. టిడిపి అభ్యర్థి మేడసాని వెంకట్రామనాయుడుతో తలపడి 21వేల ఓట్ల తేడాతో



ఓటమిపాలయ్యారు. ఎన్టీఆర్ ప్రభంజనం వీచడంతో సొంత ఊరిని వదిలిపెట్టి 1984 ఉప ఎన్నికల్లో కుప్పం నుంచి పోటీచేసి టిడిపి అభ్యర్థిగా గెలుపొందారు. అప్పటి నుంచి కుప్పం కంచుకోటగా హవా కొనసాగుతూనే ఉంది. ఎనిమిదోసారి కుప్పం నుంచి పోటీచేసి తాజాగా 48వేల ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.

బాబు అనుభవించిన కీలక పదవులు

1994లో టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నారా చంద్రబాబునాయుడు కుప్పం నుంచి గెలిచి ఆర్థిక, రెవెన్యూ శాఖా మంత్రిగా పనిచేశారు. 1995లోనే ఎన్టీఆర్ లక్ష్మీపార్వతిని వివాహం చేసుకోవడంతో ఆ పార్టీలో సంక్షోభం నెలకొంది. 1996లో ఎన్టీఆర్ ప్రభుత్వాన్ని కూల్చివేసి నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉమ్మడి రాష్ట్రానికి ముఖ్యమంత్రి పదవి చేపట్టారు. 1999లోనూ ముఖ్యమంత్రిగా ఉన్నారు. 1996లో ఎన్డీఎ కూటమికి కీలకంగా వ్యవహరించారు. 2003లో అలిపిరి బాంబుబ్లాస్ట్ ఘటన జరగడంతో ఏడాదికి ముందే ఎన్నికలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెళ్లాయి. అప్పటినుంచే సార్వత్రిక, అసెంబ్లీ ఎన్నికలు ఒకేసారి జరుగుతూ వచ్చాయి. వైఎస్ఆర్, కిరణ్‌కుమార్‌రెడ్డి, రోశయ్యలు సిఎంలుగా ఉన్నపుడు ప్రతిపక్ష నేతగా ఉన్నారు. 2014లో నవ్యాంధ్రకు ముఖ్యమంత్రిగా మూడోసారి బాధ్యతలు చేపట్టారు. 2019లో 23 సీట్లతో సరిపెట్టుకున్న చంద్రబాబు ప్రతిపక్షంలో ఐదేళ్ల పాటు ఉన్నారు. 2024 ఎన్నికల్లో బంపర్ మెజార్టీతో ఎన్డీయే కూటమి తాజాగా 164 సీట్లు సాధించి సిఎంగా బుధవారం ప్రమాణస్వీకారం చేయనున్నారు.

నేడు తిరుమలకు రాక

బుధవారం సాయంత్రం చంద్రబాబు నాయుడు కుటుంబ సమేతంగా భార్య భువనేశ్వరి, కొడుకు నారా లోకేష్, కోడలు బ్రహ్మిణి, మనవడు దేవాన్ష్, బావమరిది నందమూరి బాలకృష్ణ తదితరులు తిరుమల శ్రీవారిని దర్శించుకోనున్నారు. ప్రచారానికి ముందు, తరువాత, అరెస్టు అయ్యి విడుదల అయిన తరువాత నారా చంద్రబాబునాయుడు శ్రీవారిని దర్శించుకున్నారు. ప్రస్తుతం అత్యధిక మెజార్టీతో ప్రభుత్వ పగ్గాలు చేపట్టిన అనంతరం మరోసారి చంద్రబాబు కుటుంబ సమేతంగా బుధవారం తిరుమలకు వచ్చి ప్రత్యేక పూజలు చేయనున్నారు.

ఆశాలపై పనిభారం తగ్గించాలి

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వాడ గంగరాజు

ప్రజాశక్తి- పుంగనూరు: ఆశా కార్మికులకు పనిభారం తగ్గించాలని, కొత్త ఫోన్లు ఇవ్వాలని మంగళవారం ఆశా డే సందర్భంగా చౌడేపల్లి, లద్దిగం పీహెచ్సీలో జరిగిన సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు వాడ గంగరాజు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ఆశాలకు సమస్యలపై ఇచ్చిన హామీలు అమలు చేయకుండా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. నూతనంగా ఏర్పడిన ప్రభుత్వమైన ఆశా కార్మికుల సమస్యలపై దష్టి సారించి వారికి పనిపారం తగ్గించి, వేతనాలు పెంచి, కొత్త ఫోన్లు ఇవ్వాలన్నారు. అలాగే ఖాళీగా ఉన్న ఆశ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై ఆశా కార్మికులందరూ ఐక్యంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతన కమిటీ ఎన్నుకున్నారు. చౌడేపల్లి పిహెచ్‌సి కమిటీ అధ్యక్షురాలు అనురాధ, కార్యదర్శి రత్నమ్మ ఉపాధ్యక్షురాలు శాంతమ్మ, సహాయ కార్యదర్శి నాగమ్మ, కోశాధికారి లక్ష్మీదేవి, మరో పదిమంది కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. అలాగే లద్దిగం పిహెచ్‌సి కమిటీ అధ్యక్షురాలుగా లీలా, కార్యదర్శిగా సావిత్రి, ఉపాధ్యక్షులు పి. హేమలత, కోశాధికారి సుబ్బమ్మ, మరో ఏడు మంది సభ్యులను ఎన్నుకోవడం జరిగింది.



సమావేశంలో మాట్లాడుతున్న వాడ గంగరాజు

విద్యుత్ కాంతులతో ప్రభుత్వ కార్యాలయాలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఈనెల 12న బుధవారం గన్నవరం మండలం, కేసరపల్లి గ్రామం, ఐటి పార్క్ సమీపంలో రాష్ట్ర ముఖ్యమంత్రిగా గౌరవ నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకార మహోత్సవం కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారం చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలపై సీరియల్ సెట్లు ద్వారా విద్యుత్ కాంతులతో అలకరించాలన్న ప్రభుత్వ ఆదేశాలతో మంగళవారం సాయంత్రం నుండి 12వ తేదీ వరకు జిల్లా కలెక్టరేట్‌లోని వివేకానంద భవనం, జ్యోతిరావు పూలే భవనం, అంబేద్కర్ భవనాలు, జిల్లా ఎస్పీ కార్యాలయాలతో పాటు అన్ని ప్రభుత్వ కార్యాలయాలపై విద్యుత్ సీరియల్ సెట్లు కాంతుల లైటింగ్ ఏర్పాటు చేయడంతో పండుగ వాతావరణ కలిగిందని తెలిపారు.



విద్యుత్ దీపాల వెలుగులో జిల్లా కలెక్టరేట్

14న వేలంపాట

ప్రజాశక్తి- సోమల: మండల కేంద్రమైన సోమల పంచాయతీ పరిధిలోని చేపల చెరువులకు, సోమల ప్రైవేటు బస్టాండు, వారపు సంత నిర్వహణ కోసం వేలం పాటలను నిర్వహిస్తున్నట్టు పంచాయతీ కార్యదర్శి సుధాకర్ కుమార్ తెలిపారు. ఈనెల 14వ తేదీ శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటలకు మండల కేంద్రంలోని సచివాలయంలో వేలం పాటలు నిర్వహిస్తామని 12వ తేదీ లోపు ధరావతు చెల్లింపు నియమనిబంధనల గురించి వేలంపాట దారులు కార్యాలయంలో వచ్చి తెలుసుకొనవచ్చునని అన్నారు. వేలం పాటలను సర్పంచ్, మండల అభివద్ధి అధికారి, మండల విస్తరణ అధికారి ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని ఆసక్తి గలవారు వేలంపాటలో పాల్గొనవచ్చునని తెలిపారు.

సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి

డిఎం అండ్ హెచ్ఓ ప్రభావతి



జూమ్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న డిఎం అండ్ హెచ్ఒ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: సీజనల్ వ్యాధులు, అతిసార వ్యాధి ప్రభలకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఓ. ప్రభావతి దేవి జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా డిఏం అండ్‌హెచ్ ఓ మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులైన డయేరియా, అతిసార రాకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై వివరించారు. మాత శిశు సంరక్షణలో భాగంగా ప్రతి గర్భిణీ రక్తహీనత రాకుండా ఐరన్ మాత్రలు వేసుకోవాలన్నారు. ప్రతి గర్భిణీ తప్పనిసరిగా టిఫా స్కాన్, సాధారణ స్కాన్ చేసుకోవాలన్నారు. దీని వలన గర్భంలో బిడ్డ ఎలా ఎదుగుతుందో తెలుసుకుని ఏదైనా తీవ్ర పరిణామాలు ఉంటే పెద్ద ఆసుపత్రికి రెఫర్ చేయడం జరుగుతుందన్నారు. ప్రతి గురువారం తప్పనిసరిగా అడల్ట్ బిసిజి వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఎలిజి ఉన్నవాళ్ళకు మాత్రమే వేసి యాప్‌లో అప్డేట్ చేయాలనీ తెలిపారు.

కొత్తఇండ్లు గ్రామంలో అతిసార

బైరెడ్డిపల్లి: గత ఐదు రోజులుగా కొత్త ఇండ్లు గ్రామంలో అతిసార సోకిందని వైద్యులు నిర్ధారించారు. మూడు రోజులుగా గ్రామంలో చికిత్స పొందుతున్న ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండలంతో మెరుగైన చికిత్స కోసం కుప్పం పిఎస్ ఆసుప్రతికి తరలించారు. డాక్టర్ అరుణ చంద్ర మాట్లాడుతూ వర్షపునీరు, మురుగునీరు కలవడం ఆ నీరు తాగునీటి ట్యాంకు పైపుల ద్వారా సరఫరా అవ్వడం వల్ల అతిసార వ్యాపించిందని తెలిపారు. గ్రామంలో పారిశుధ్య చర్యలు చేపట్టాలని, గ్రామంలో వ్యాధి త్రీవత తగ్గేవరకూ వైద్యశిబిరాలు కొనసాగతాయని తెలిపారు.



అక్రమ మద్యం ధ్వంసం



ప్రజాశక్తి- గంగవరం: గంగవరం పోలీసు స్టేషన్ పరిధిలో 45 పాత కేసులలో పట్టుబడిన అక్రమ మద్యంను జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఎన్ఫోర్స్మెంట్ సూపరింటెండెంట్ వి. శ్రీధర్ రావు ఆధ్వర్యంలో ఇద్దరు విఆర్‌లో సమక్షంలో ధ్వంసం చేసినట్లు సీఐ చిన్న గోవిందు విలేకరుల సమావేశంలో తెలిపారు. సుమారు 25,66,990 రూపాయల విలువ గల 3667 లీటర్లు అక్రమ మద్యంను మంగళవరాం కుర్నిపల్లి రోడ్డులో కౌండిన్య నది దగ్గరలో నాశనం చేయడం జరిగిందన్నారు.

డీలర్ మృతికి నివాళి



ప్రజాశక్తి- వెదురుకుప్పం: వెదురుకుప్పం గ్రామానికి చెందిన డీలర్ కె.షణ్ముగం రెడ్డి (41) మంగళవారం అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. మృతుని కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

తాగి వాహనాలు నడిపిన 11 మందికి జరిమానా

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జిల్లా ఎస్పీ విఎన్.మణికంఠ చందోలు ఆదేశాలతో చిత్తూరు సబ్-డివిజన్ డీఎస్పీ రాజగోపాల్ రెడ్డి సూచనల మేరకు చిత్తూరు ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ నిత్యబాబు సోమవారం చిత్తూరు నగరంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సమయంలో మద్యం తాగి వాహనాలు నడుపుతూ 11 మంది పట్టుబడ్డారు. వీరిని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టులో మంగళవారం ఉదయం ప్రవేశపెట్టగా జడ్జి ఉమాదేవి వాహనదారులకు ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున మొత్తం 1 లక్ష పది వేల రూపాయలు జరిమానా విధించడం జరిగింది. ఈ ఆరు నెలల వ్యవధిలో చిత్తూరు ట్రాఫిక్ పోలీసులు మద్యం తాగి వాహనాలు నడిపిన 205 మందికి సుమారు 14 లక్షల రూపాయలు జరిమానా విధించడం జరిగిందన్నారు. రోడ్డు భద్రత నియమాలను పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యతని, జిల్లాలోని ప్రతిఒక్కరు రోడ్డు నియమాలను తప్పక పాటించాలని లేదా భారీ జరిమానాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ నిత్యబాబు తెలిపారు.

మద్యం తాగి వాహనం నడపడం అత్యంత ప్రమాదకరమని. ఇది మీ ప్రాణాలకు, ఇతరుల ప్రాణాలకు ప్రమాదం కలిగిస్తుందని అవగాహన



కల్పించారు. మద్యం తాగి డ్రైవింగ్ చేస్తే మొదటిసారి నేరం చేస్తే రూ. 10,000లు జరిమానా, లేదా 6 నెలల జైలు శిక్ష, లేదా రెండూ విధించవచ్చు. రెండోసారి నేరం చేస్తే రూ.15,000లు లేదా 3 సంవత్సరాల జైలుశిక్ష, లేదా రెండును విధించవచ్చునని తెలిపారు. కనుక వాహనం నడిపే సమయంలో వాహనదారులు రోడ్డు భద్రత, రహదారి నిభందనలు తప్పక పాటించి ప్రమాదాలు, జరిమానాలు, శిక్షలకు గురి కాకుండా ఉండాలని ఇన్స్పెక్టర్ నిత్యాబాబు కోరారు.

ఇరువారం జాతరలో గురజాల చెన్నకేశవ నాయుడు

ప్రజాశక్తి చిత్తూరుఅర్బన్: చిత్తూరు నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో గంగమ్మ జాతర సందర్భంగా స్థానిక ప్రజల ఆహ్వానం మేరకు గంగమ్మ తొలి పూజలకు హాజరై ప్రత్యేక పూజా కార్యక్రమాలలో పాల్గొన్న చిత్తూరు ఎంఎల్ఏ గురజాల జగన్ మోహన్ తండ్రి గురజాల చెన్నకేశవులు నాయుడు , జిజేఎం సోదరుడు గురజాల జీవన్ ఇరువారం గంగజాతర తొలిపూజ చేసి జాతరను ప్రారంభించారు. స్థానిక కార్పొరేటర్ అశోక్ ఘనంగా స్వాగతం పలికారు. స్థానిక ప్రజలు ఉమ్మడి పార్టీల నాయకులు కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు.




ఇరువారం జాతరలో గురజాల చెన్నకేశవ నాయుడు

చినుకు పడితే చిత్తడే

రహదారులన్నీ జలమయం

ప్రజాశక్తి - బిఎన్ కండ్రిగ, ఏర్పేడు

వర్షాకాలం మొదలయ్యింది. ఉక్కబోత పోయి వాతావరణం చల్లబడిందన్న ఆనందం ఓ వైపుంటే, మరోవైపు చినుకుపడితే చాలు రహదారులన్నీ జలమయమై పాదచారులకు ఇబ్బందులు తెచ్చి పెడుతున్నాయి. సూళ్లూరుపేటకు వెళ్లే రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. పెరిటపాడు గ్రామానికి వెళ్లే రోడ్డు గుంతలమయమయ్యింది. ఉన్నపళంగా బ్రేకులు వేయడంతో వెనకనుంచి వచ్చే వాహనాలు ఢీకొనడంతో ప్రమాదాలు తప్పడం లేదు. దీంతో గమ్యం చేరాలంటే ప్రయాణికులు భయపడుతున్నారు. గుంతలు కూడా సామాన్యంగా లేవు. మోకాళ్ల లోతు గుంతలు. దీందో ప్రయాణికులకు రోడ్డుపై గుంత ఎక్కడుందో తెలియక అష్టకష్టాలు పడి వెళ్లాల్సి వస్తోంది. ఈ మార్గంలో శ్రీసిటీ పరిశ్రమలు ఉండడంతో వాహనాలు తరచూ వచ్చి వెళుతుంటాయి. కార్మికుల సంఖ్య పెరిగింది. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మోకాళ్లలోతు గుంతలతో వాహనదారుల బాధలు వర్ణనాతీతం. పరిమితికి మించిన లోడ్‌తో వాహనాలు వెళుతుండడంతో రోడ్డు ఎక్కడుంతో తెలియని పరిస్థితి. రెండేళ్ల క్రితం ఉమ్మడి జిల్లాగా ఉన్నపుడే సూళ్లూరుపేట నుంచి బుచ్చినాయుడు కండ్రిగ వరకూ కోట్ల రూపాయలు విస్తరణకు మంజూరయ్యాయి. అయితే సదరు కాంట్రాక్టర్ కొంత దూరం పనులు చేపట్టి, పెరిటిపాడు నుంచి బిఎన్ కండ్రిగ వరకూ పనులను అర్ధాంతరంగా నిలిపేశారు. దీంతో ఉద్యోగులు, కార్మికులకు ఇబ్బందులు తప్పడం లేదు. రోడ్డుకు ఇరువైపులా ముళ్లపొదలు పెరిగి మలుపుల వద్ద ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కనీసం మలుపుల వద్ద సూచిక బోర్డులు సైతం




బిఎన్ కండ్రిగలో..

లేనేలేవు. దీంతో వాహనదారులకు ఈ రహదారి నరకప్రాయంగా కనిపిస్తోంది. ఇటీవలే సిసిఎల్ కంపెనీకి ఉన్నతాధికారులు వచ్చారు. 13 కిలోమీటర్ల రోడ్డు బాగు చేయకపోయినా పట్టించుకోలేదని వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. మూడు రోజుల క్రితం ద్విచక్రవాహనంపై సూళ్లూరుపేటకు వెళుతున్న వ్యక్తి సాధనవారిపాళ్యం మలుపు వద్ద బస్సు ఢీకొనడంతో వాహన చోదకుడు ప్రమాదానికి గురయ్యాడు. ఎన్ని ప్రమాదాలు జరిగినా ఉన్నతాధికారులు మాత్రం చోద్యం చూడటమే వారి వంతయ్యింది.

జలపాతంలా సిమెంట్ రోడ్డు

ఏర్పేడు మండలం చిందేపల్లి గ్రామ పంచాయతీలో సిమెంట్ రోడ్లు చిన్నపాటి వర్షానికి జలపాతంగా మారుతున్నాయి. అప్పటి టిడిపి, కాంగ్రెస్ ప్రభుత్వంలో ఈ సిసి రోడ్లను నిర్మించారు. అయితే గత పాలనలో ఎటువంటి రోడ్ల నిర్మాణం చేయక చిన్నపాటి వర్షానికే సిసి రోడ్లు నీట మునిగి చెరువులను తలపిస్తున్నాయి. దెబ్బతిన్న రోడ్డు క్రమపద్ధతిలో లేకపోవడంతో పైనుంచి దిగువకు వర్షపునీరు ప్రవహించడం లేదు.ప్రధాన మార్గం పక్కన సైడ్ కాల్వలూ నిర్మించక పోవడమూ సమస్యకు కారణంగా తెలుస్తోంది. వర్షపు నీరు నిల్వ ఉండడంతో అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లే చిన్నారులు, గర్భిణులు, రోడ్డుపై వెళ్లే వృద్ధులు, ఎంపిపి స్కూలుకు వెళ్లే పిల్లలు కాలుజారి పడిపోతున్నారు. ఈ సమస్య పంచాయతీలోని అనేక గ్రామాల్లో ఇలాగే ఉంది. దోమలు వృద్ధిచెంది జ్వరాలు ప్రబలుతున్నాయని, అధికారులు స్పందించి రహదారుల మరమ్మతు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



ఏర్పేడులో..

నేడు సోమల గంగ జాతర

ప్రజాశక్తి- సోమల

మండల కేంద్రమైన సోమలలో నేడు బుధవారం గంగ జాతరను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు గ్రామ పెద్దలు అన్ని ఏర్పాట్లను పూర్తి చేస్తున్నారు. సోమవారం రాత్రి అమ్మవారి మట్టివిగ్రహాన్ని స్థానిక శివాలయం ఎదురుగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పందిరి నందు ప్రతిష్టించనున్నారు. బుధవారం ఉదయం నడివీధి పొంగళ్ళు, అమ్మవారికి ప్రత్యేక పూజలు కర్పూర హారతులు అందజేయనున్నారు. బుధవారం సాయంత్రం అమ్మవారి మట్టి విగ్రహాన్ని నీళ్లలో నిమజ్జనం చేసి జాతరను సమాప్తం చేయనున్నారు. ఇందుకోసం గ్రామం మొత్తం రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. బస్టాండ్ కూడలిలో శివాలయం వద్ద అమ్మవారి విద్యుత్ కటౌట్లను ఏర్పాటు చేశారు. కాగా నంజంపేట, పొదలకుంటపల్లి, సూరయ్య గారి పల్లి పంచాయతీల పరిధిలో కూడా బుధవారం గంగజాతర వేడుకలను నిర్వహించనున్నారు. పోలీసులు గంగ జాతర జరగనున్న పంచాయతీలలో బందోబస్తు నిర్వహించనున్నట్లు ఎస్సై వెంకట నరసింహులు తెలిపారు.

ప్రశాంత వాతావరణంలో జాతర : సీఐ



ప్రజాశక్తి- సోమల: మండలంలోని సోమల, నంజంపేట, పొదలకుంటపల్లి, సూరయ్యగారిపల్లి గ్రామాలలో జరగనున్న గంగ జాతర వేడుకలను ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో సాంప్రదాయబద్ధంగా నిర్వహించుకోవాలని చౌడేపల్లి రూరల్ సీఐ కష్ణారెడ్డి సంబంధిత గ్రామాల గ్రామ పెద్దలను కోరారు. స్థానిక పోలీస్ స్టేషన్లో సంబంధిత గ్రామ పెద్దలతో సమావేశాన్ని నిర్వహించారు. సిఐ మాట్లాడుతూ డీజేలు నిర్వహించడం, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం, అకారణంగా గొడవలు ఘర్షణలు పడడం చేయరాదని, గ్రామ పెద్దలు పండుగ వాతావరణాన్ని ప్రశాంతంగా వేడుకగా నిర్వహించుకునే విధంగా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సై వెంకట నరసింహులు, పోలీసు సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అమ్మవారికి ముత్యాల హారాలు వితరణ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ముక్కంటి సమేత జ్ఞాన ప్రసూనాంబ దేవికి బూస్టర్ అమెరికా దేశానికి చెందిన ప్రవాస ఆంధ్రులు ఐకా రవి, గాయత్రి దంపతులు మంగళవారం ముత్యాలతో కూడిన చీర, కిరీటం కవచం, వడ్డానం, హస్తం, పాదాలను వితరణ చేశారు. వీటిని చంద్రశేఖర స్వామి దంపతులు చేతులు శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు కు అందించారు.

బొజ్జల సుధీర్ రెడ్డికి సన్మానం

ప్రజాశక్తి- ఏర్పేడు : కాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డిని ఏర్పేడు మండలం టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జి పేరం నాగరాజు నాయుడు ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. శ్రీవారి శేష వస్త్రంతో సన్మానించి శ్రీవారి ప్రసాదాలు అందిం చారు. అమరావతిలో ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా అమరావతి లో బొజ్జల వెంకట సుధీర్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపి వారు సన్మానించారు. ఈ కార్యక్రమంలో గుడిమల్లం ఆలయ మాజీ ట్రస్ట్ ఛైర్మన్ బత్తల గిరిబాబు నాయుడు, మడిబాక మాజీ సర్పంచ్ రాయపనేని రవి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com
చిత్తూరు
బుధవారం 12 జూన్ 2024

సీఎం ప్రమాణ స్వీకారానికి తరలిన నేతలు



ఎస్‌ఆర్ పురం మండల నేతలు

ప్రజాశక్తి-ఎస్‌ఆర్ పురం: నూతన ఏపీ సీఎంగా చంద్రబాబు ప్రమాణస్వీకారం చేయనున్న సందర్భంగా టీడీపీ శ్రేణులు ఎస్‌ఆర్ పురం మండలం నుంచి విజయవాడకు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. మండల పార్టీ అధ్యక్షులు గంధమనేని జయశంకర్ నాయుడు, రాజశేఖర్ నాయుడు ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సులో మంగళవారం మండల కేంద్రం నుంచి బయలుదేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీడీ నెల్లూరు గడ్డపై తొలిసారిగా టీడీపీ విజయం సాధించడం సంతోషంగా ఉందని వారు తెలిపారు. ఎమ్మెల్యే థామస్‌ను అత్యధిక మెజారిటీతో గెలుపొందడంపై ఆనందంగా ఉందని స్పష్టం చేశారు.

కార్వేటినగరం నుంచి పెద్ద ఎత్తున..

ప్రజాశక్తి-కార్వేటినగరం: చంద్రబాబు సీఎంగా బుధవారం ప్రమాణ స్వీకారం చేయనున్న సందర్భంగా మండలం నుంచి మంగళవారం టీడీపీ నాయకులు ప్రత్యేక బస్సులో పెద్ద ఎత్తును విజయవాడకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా నాగేశ్వర రాజు, చెంగల్రాయల్ యాదవ్ మందడి మాట్లాడుతూ చంద్రబాబు ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. టీడీపీ గెలవడంతోనే అమరావతి రాజధాని పనులు ప్రారంభమైందని, ఇంకా మంచి రోజులేనని వివరించారు. నాయకులు రవియాదవ్, సోమశేఖర్ యాదవ్, ధనుంజయ రాజు, పవన్ కుమార్, గణేష్, రాధాకృష్ణ యాదవ్, రాజా, సురేష్ రెడ్డి, మునిరాజు, లోకేష్ తదితరులు వెళ్లారు.

జీడీ నెల్లూరు నుంచి..

ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు: చంద్రబాబు బుధవారం ముఖ్యమంత్రిగా ప్రమాణాస్వీకారం పురస్కరించుకుని నెల్లేపల్లె పంచాయతీకి చెందిన ముగ్గురు బీసీ నేతలు ఆధ్వర్యంలో 50మంది విజయవాడకు బయలుదేరారు. మండల పరిధిలోని నెల్లెపల్లి పంచాయతీ ఎన్.వెంకటాపురంకి చెందిన రమేష్ బాబు, మురళి, మాజీ సర్పంచ్ మన్నారయ్యలు ఆధ్వర్యంలో బస్సును ఏర్పాటు చేసుకుని విజయవాడకు తరలివెళ్లారు.

చిత్తూరు నుంచి..

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: కేసరపల్లిలో చంద్రబాబు ప్రమాణాస్వీకారానికి చిత్తూరు ఎమ్మెల్యే గురజల జగనోహన్ నేతృత్వంలో నియోజవర్గ చిత్తూరు అర్బన్, రూరల్, గుడిపాల మండలాల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారిగా ప్రత్యేక బస్సులో తరలివెళ్లారు. జీజేఎం ట్రస్ట్ ట్రస్టీ గురజాల చెన్నకేశవులు నాయుడు, ఎమ్మెల్యే సోదరులు జీవన్ జెండా ఊపి ప్రారంభించారు.

పలమనేరు నుంచి..

ప్రజాశక్తి-పలమనేరు: సీఎంగా చంద్రబాబు బుధవారం ప్రమాణస్వీకారం చేపడుతున్న సందర్భంగా పలమనేరు నియోజకవర్గంలోని గంగరవం, పెద్దపంజాని, పలమనేరులకు చెందిన నాయకులు పెద్ద ఎత్తున విజయవాడకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ప్రత్యేక బస్సును తహశీల్దార్ రంగనాయకులు జెండా ఊపి ప్రారంభించారు. మున్సిపల్ కమీషనర్ రమణారెడ్డి, న్యాయవాదుల భార్ అసోషియేషన్ అధ్యక్షులు లక్ష్మీపతి, సీనియర్ న్యావాదులు ఎల్.భాస్కర్, లక్ష్మణ్, జగదీష్‌లతో పాటు నేతలు గిరిబాబు, దీపికా కృష్ణమూర్తి, నాగరాజు, ఖాజాపీర్ తదితరులు పాల్గొన్నారు.

సదుంలో నేడు..

ప్రజాశక్తి-సదుం: చంద్రబాబు సీఎంగా ప్రమాణస్వీకారం చేయనున్న సందర్భంగా కార్యక్రమాన్ని వీక్షించేందుకు ఆయా గ్రామ సచివాలయాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు మంగళవారం ఏపీఎం హరిప్రసాద్ తెలిపారు. బుధవారం ఉదయం 10గంటల నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ప్రత్యేకించి మహిళా సంఘాల సభ్యులు హాజరవుతారని పేర్కొన్నారు.

పుంగనూరు పసుపు మయం

- వెలసిన కూటమి ఫ్లెక్సీలు
- నాయకుల రెట్టింపు ఉత్సాహం
- 15ఎళ్ల నిరీక్షణ తర్వాత వైసీపీ క్యాడర్ నిరుత్సాహం

ప్రజాశక్తి-పుంగనూరు: 15 సంవత్సరాల నిరీక్షణ తర్వాత నియోజకవర్గం పసుపు మయం అయ్యింది. కూటమి నేతలు జెండాలు, ఫ్లెక్సీలు భారీగా ఏర్పాటు చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు 4వ పర్యాయం ప్రమాణ స్వీకారోత్సవాన్ని పురస్కరించుకొని నియోజకవర్గంలో కూటమి పార్టీలు భారీగా ఫ్లెక్సీలు, కటౌట్‌లో ఏర్పాటైయ్యాయి. పుంగనూరు నియోజకవర్గంలో ఫ్లెక్సీ ఏర్పాటు చేయాలన్న, పార్టీ తోరణాలు కట్టాలన్న అధికార పార్టీకి తప్ప మరొక పార్టీ చేపట్టకూడదు ఇలాంటి నిబంధనలు గత 15సంవత్సరాలుగా జరిగింది. 2014 అధికారంలో తెలుగుదేశం పార్టీ ఉన్న పుంగనూరు నియోజకవర్గంలో మాత్రం వైసీపీ ఎమ్మెల్యేగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఉన్నప్పుడు కూడా ఫ్లెక్సీలు కట్టడానికి అధికార పార్టీ నాయకులు ఎవరు సాహసం చేయలేదు. ఏ పార్టీ అయినా కార్యక్రమాలు ఏవైనా ఉన్నప్పుడు మాత్రం ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకోడానికి అధికారులు అనుమతులు ఇచ్చేవారు. కార్యక్రమం ముగిసిన వెంటనే తొలగించే ఆదేశాలు కూడా ఇచ్చేవారు. 2004 నియోజకవర్గాల పునర్విభజన తరువాత సదుం మండలం పుంగనూరు నియోజకవర్గంలో కలవడంతో అప్పటి పీలేరు ఎమ్మెల్యేగా ఉన్న డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పుంగనూరు రావడం జరిగింది. పుంగనూరుకు ప్రాతినిధ్యం వహించిన తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే నూతనకాల్వ అమర్నాథ్ రెడ్డి వారి సొంత మండలం పెద్దపంజాణి కావడంతో ఆ మండలం పలమనేరు నియోజకవర్గం కలవడంతో అక్కడికి వెళ్లాల్సి వచ్చింది. నూతన కాలువ కుటుంబం ప్రాతినిధ్యం వహించే అంతవరకు పుంగనూరు నియోజకవర్గంలో టీడీపీకి కంచుకోట. నియోజకవర్గంలో విభజనతో తారు మారు అయ్యాయి. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పుంగనూరు నియోజకవర్గంకు రావడంతోపార్టీకి బలమైన క్యాడర్‌ను నిర్మించుకున్నారు. అప్పటి నుంచి 2009, 2014, 2019, 2024 వరుసగా నాలుగు పర్యాయాలు అత్యధిక మెజార్టీతో గెలుస్తూ రావడం జరిగింది. 2009, 2014 రెండు పర్యాయాలు తెలుగుదేశం పార్టీ అభ్యర్థి ఎం.వెంకటరమణ రాజు పైన, 2019లో నూతన కాలువ అనిషా రెడ్డి పై, 2024 చల్లా రామచంద్రారెడ్డి పైన స్వల్ప మెజార్టీతో విజయం సాధించారు. నాలుగు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలవడం మంత్రిగా పనిచేయడం జరిగింది. 2019 నుంచి 2024వరకు మూడు మంత్రి పదవులుతో నియోజకవర్గంలో అన్ని రంగాల అభివృద్ధి చేశారు. దాంతో పాటు ప్రతిపక్ష పార్టీల్లో ఎవరిని ఎదగనివ్వకుండా, ఉన్న క్యాడర్‌పై కేసులు బనాయించడం, వారి ఆర్థిక మూలాలను దెబ్బతీయడంతో తెలుగుదేశం పార్టీ క్యాడర్ పూర్తిగా దెబ్బతింది. నియోజకవర్గంలో ఏ పార్టీ వారైనా వారికి వ్యతిరేకంగా మాట్లాడి నట్లు అయితే వారిపై భౌతిక దాడులు, పోలీస్ కేసులు పెట్టడం అన్ని రకాల ఇబ్బందులు గురి చేయడం తరచూ జరిగేది. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని టీడీపీ ప్రయత్నించిన వారి ఆశలు అడియాసలయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా టీడీపీకి అనుకూల పవనాలు వీచినా పుంగనూరులో మాత్రం వైసిపి కేడర్ సర్వశక్తులు వడ్డీ అతి స్వల్ప మెజార్టీతో గట్టెక్కడం జరిగింది. అయితే రాష్ట్రవ్యాప్తంగా అత్యధిక సీట్లు టిడిపి సాధించడంతో పుంగనూరు నియోజకవర్గం నిశ్శబ్ద వాతావరణం నెలకొంది. వైసిపి క్యాడర్ నిస్తేజంగా ఉంది. చంద్రబాబు ప్రమాణ స్వీకారం పురస్కరించుకుని పుంగనూరు మున్సిపల్ కేంద్రంలో భారీగా ఫ్లెక్సీలును కూటమి పార్టీలైన తెలుగుదేశం, జనసేన, బిజెపి పార్టీలు ఏర్పాటు చేశారు. పట్టణంలో భారీగా ఫ్లెక్సీ ఏర్పాటు చేయడంతో ప్రధాన చర్చి నడుస్తుంది.



ఈఏపి సెట్ ఫలితాల్లో పిఎస్ఎన్ వివేకానంద జూనియర్ కళాశాల ప్రతిభ



ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: విడుదలైన ఏపి ఈఏపి సెట్ పరీక్షా ఫలితాల్లో స్థానిక మురుగానుపల్లి వద్ద ఉన్న శ్రీ వివేకానంద జూనియర్ కళాశాల సత్యనారాయణ (పిఎస్ఎన్) ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించారని మంగళవారం ఒక ప్రకటనలో శ్రీ వివేకానంద జూనియర్ కళాశాల కరెస్పాండెంట్ సత్యనారాయణ, ప్రిన్సిపాల్ నాగరాజశెట్టి తెలిపారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులచే ఏపి ఈఏపి సెట్ బోధించడం ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించడం సాధ్యమైందని ఆహ్లాదరక వాతావరణంలో విద్యార్థులోని శక్తిసామర్థ్యలను వెలికి తీసి ఉత్తమ శిక్షణ ఇచ్చిన్నట్లు తెలిపారు. తమ జూనియర్ కళాశాల్లో చదువుతున్న విద్యార్థులు ఎక్కువ మంది ఏపి ఈఏపి సెట్‌కు క్యాలిఫై కావడం ఎంతో ఆనందగా ఉందని తమ కళాశాల విద్యార్థులు 2024 ఏపి ఈఏపి సెట్‌కు ర్యాంకులు సాధించిన వారిలో చరిత చౌదరి 2,272, సీమా 2,967, చందన 3,123, నిహిత 3,205, ప్రీతి 4,387, దినేష్ కార్తీక్ 5,045, పవన్ 5,369, గీతశ్రీ 5,756, కృష్ణకుమార్ 6,409, రితిక్‌రాజు 6,478, చాందని 6,542, చంద్రశేఖర్ 7,243, మోహిత్ 7,280, మాధవిప్రియ 7,740, కీర్తిరెడ్డి 7,995, మోహిత్ 8,182, వైష్ణవి 8,442, శశాంక్ 9,771, విగ్నేష్ 9,839, దీపికా రెడ్డి 10,812 ర్యాంకులు సాధించారని తెలిపారు. ఉత్తమ స్థాయి ర్యాంకులు సాదించిన విద్యార్థులకు ఉత్తమ శిక్షణ అందించిన అధ్యాపకులు విద్యార్థుల తల్లిదండ్రులకు కళాశాల కరెస్పాండెంట్ సత్యనారాయ, ప్రిన్సిపాల్ నాగరాజుశెట్టి అభినందనలు తెలిపారు.












ఏపీ ఎంసెట్ ఫలితాల్లో విజయం ప్రతిభ



ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: ఏపీ ఎంసెట్ ఫలితాలలో తమ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపరిచారని విజయం విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఎం.తేజో మూర్తి తెలిపారు. సౌమ్య-10,781, లీనా - 10,900, సుకేష్ -11,000, మనోజ్-12,607 ర్యాంకులు సాధించిన్నట్లు పేర్కొన్నారు. వీరితో పాటు 26మంది విద్యార్థులు 20,000లోపు ర్యాంకులు సాధించాలని ఆయన తెలిపారు.

ఎంసెట్‌లో శ్రీవివేకానంద ఉత్తమ ఫలితాలు

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: ఎంసెట్ ఫతితాల్లో శ్రీ వివేకానంద జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని కళాశాల కరెస్పాండెంట్ భాస్కర్ నాయుడు, మహేంద్ర కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. (సి నెంబర్...09190)కి చెందిన విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించారని వీరిలో తరుణ్‌కుమార్ 2,756 స్టేట్ ర్యాంకు సాధించా రని ఆదే విధంగా భవ్యశ్రీ 6,082 స్టేట్ ర్యాంకు సాధించిన్నట్లు తెలిపారు. వీరితో పాటు పది వేల లోపు ర్యాంకులు సాధించిన విద్యార్థులను, అధ్యాపకులను శ్రీ వివేకానంద జూనియర్ కళాశాల కరెస్పాండెంట్లు అభినందించారు.









ఆరిమాను గంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



అమ్మవారి ఆలయం వద్ద పొంగళ్లు వండుతున్న భక్తులు

ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం: మండలంలోని చిత్తూరు-పుత్తూరు మార్గంలోని ఆరిమాకులపల్లిలో వెలసిన ఆరిమాని గంగమ్మ ఆలయంలో మంగళవారం గంగ జాతర సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయం భక్తులతో కిటకిటలాడింది. జాతర సందర్భంగా చిన్నారులు, యువత, మహిళలు పొంగళ్ళు తీసుకొని వివిధ వేషాధారణలో అమ్మవారి మ్రొక్కులు తీర్చుకున్నారు. కార్వేటినగరం మహారాజా వారు ఈ ఆలయ బాధ్యతను తయూరు పాయకట్టు 18గ్రామాలకు అప్పగించారు. ఈ ఆలయం నాటి నుంచి నేటి వరకు ఆనవాయితీగా భక్తుల తాకిడి ఉంటుంది. అమ్మవారి సంప్రోక్ష గ్రామాలైన తయ్యూరు పాయకటి 18గ్రామాల ప్రజలు బండి కుంభాలతో వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు వెంకటాచలపతి బృందం అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

మొక్కు తీర్చుకున్నా: సర్పంచ్

ప్రజాశక్తి-గంగవరం: చంద్రబాబు సీఎం అయితే కోనేటిరాయ స్వామి ఆలయంలో మోకాళ్లపై ప్రదక్షిణ చేస్తానన్న మొక్కు తీర్చుకున్నట్లు కీపట్ల సర్పంచ్ చంద్రబాబు తెలిపారు. మంగళవారం ఆలయం చుట్టూ మోకాళ్లపై ప్రదక్షిణ చేశారు. టీడీపీ విజయం సాధించడం తనకు ఎంతో సంతోషానిచ్చిందన్నారు. అనంతరం ఆలయం వద్ద 101కొబ్బరికాయలు కొట్టారు. ప్రత్యేక పూజలనంతరం ఆలయం వద్ద అన్నదానం చేపట్టారు.

రాజీనామా



రాజీనామా పత్రాన్ని అందజేస్తున్న అరుణమ్మ

ప్రజాశక్తి-సోమల: సోమల మార్కెట్ కమిటీ ఛైర్మన్ పదవికి అరుణమ్మ మంగళవారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని సెక్రటరీ సరళ కుమారికి అందజేశారు. ఈ సందర్భంగా అరుణమ్మ మాట్లాడుతూ పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశాలతో తన పదవికి రాజీనామా చేసినట్లు తెలిపారు. గతంలో రెండు సంవత్సరాలు, ప్రస్తుతం ఒకటిన్నర సంవత్సరం మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించినట్లు తెలిపారు. కాగా అరుణమ్మ భర్త మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ నాగేశ్వరరావు మాట్లాడుతూ తాను రెండు పర్యాయాలు మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించానని తెలిపారు.

సీఎం ప్రమాణస్వీకారం చూడడానికి ఏర్పాట్లు

గంగవరం: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నేడు ఎన్.చంద్రబాబు నాయుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా మండల ప్రజా పరిషత్ కార్యాలయపు సమావేశ మందిరంలో ప్రమాణస్వీకార మహోత్సవ కార్యక్రమాన్ని ఉదయం 10 గంటల నుండి వీక్షించుటకు ఏర్పాట్లు చేసినట్లు ఎంపీడీవో మధుసూదన రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలు పాల్గొని ఈకార్యక్రమాన్ని తప్పక వీక్షించాల్సిందిగా కోరారు.

పేగలవారిపల్లెను సందర్శించిన డీఎంహెచ్‌వో బృందం

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-సోమల: సోమల మండలం తమ్మినాయునిపల్లి పంచాయతీ పేగలవారిపల్లె గ్రామంలో మూడు రోజులుగా పలువురు గ్రామస్తులు వాంతులు విరేచనాలతో ఇబ్బంది పడుతున్నారు. దీనికి సంబంధించి ప్రజాశక్తిలో వార్త సోమవారం ప్రచురితం కావడంపై అధికారులు స్పందించారు. డిఎంహెచ్‌వో కార్యాలయ సిబ్బంది మంగళవారం గ్రామాన్ని సందర్శించి ప్రజలకు పలు సలహాలు, సూచనలను ఇచ్చారు. మూడు రోజులుగా గ్రామంలోని ఒకే కుటుంబానికి చెందిన కొందరికి మరొక కుటుంబానికి చెందిన కొందరికి వాంతులు విరేచనాలు రావడంతో ఒకరిద్దరూ మెరుగైన వైద్యం కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లి వైద్యం పొందుతున్నారు. మిగిలిన వారికి కందూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య సిబ్బంది గ్రామంలోనే శిబిరాన్ని ఏర్పాటు చేసి సేవలందిస్తున్నారు. నాలుగు రోజులుగా ప్రజలకు మందులు మాత్రలను అందజేస్తూ నిత్యం పర్యవేక్షిస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం డీఎంహెచ్‌వో కార్యాలయానికి చెందిన సిహెచ్‌ఓ జయంతి, ఎంపిహెచ్‌వో మోహన్ శెట్టి పేగలవారిపల్లెను సందర్శించారు. గ్రామంలో పారిశుధ్యం, త్రాగునీరు ఏ విధంగా అందుతుందని పరిశీలించారు. అనంతరం త్రాగు నీటిని శాంపిల్స్ తీసుకుని పరీక్షల కోసం పంపనున్నట్లు తెలిపారు. స్థానిక పంచాయతీ కార్యదర్శి నాగభూషణం గ్రామంలో



గ్రామస్తులకు సూచనలు ఇస్తున్న జిల్లా వైద్య బృందం



మిలాథిన్ స్ప్రే చేస్తున్న కార్మికులు

మిలాథిన్ మందును స్ప్రే చేయించారు. తాగునీటిని కాచి చల్లార్చి తాగాలని, బయట ప్రాంతాల నుంచి తెచ్చుకున్న ఆహారాన్ని, మాంసాన్ని తినకూడదని కొద్ది రోజులు వైద్యుల సలహాల మేరకే గ్రామస్తులు ఆహార నియమాలు పాటించాలని జిల్లా అధికారులు గ్రామస్తులకు సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారిని విజయలక్ష్మి, సూపర్వైజర్ ప్రమీల, ఎంఎల్‌హెచ్‌పి భావన, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌కి మోక్షం



ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరు బస్టాండ్ పార్కు సమీపంలో గతంలో ఏర్పాటు చేసిన అన్నా క్యాంటీన్ ఐదేళ్లుగా మూతపడింది. బుధవారం చంద్రబాబు ప్రమాణస్వీకారం చేపడుతున్న శుభసందర్భంగా మంగళవారం మున్సిపల్ సిబ్బంది అన్నా క్యాంటీన్ పరిసరాలను శుభ్రం చేశారు. దీంతో మళ్లీ అన్నా క్యాంటీన్ పూన:ప్రారంభమవుతుందని ప్రజలు విశ్వసిస్తున్నారు.

రంగురంగుల విద్యుత్ వెలుగులు



ప్రజాశక్తి-సోమల: ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రావడం బుధవారం ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారోత్సవం చేస్తున్న సందర్భంగా మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలలో సీఎం ప్రమాణ స్వీకారాన్ని లైవ్ ప్రజలు వీక్షించే విధంగా ఏర్పాటు చేస్తున్నారు. మండలంలోని రైతు భరోసా కేంద్రాలు, సచివాలయాలు, పంచాయతీ కార్యాలయాలు, మండల సమైక్య కార్యాలయానికి రంగురంగుల విద్యుత్ దీపాలంకరణలు చేయించారు.

గంగాధర నెల్లూరు: మండలంలోని మండల కార్యాలయాలు, గ్రామ సచివాలయల భవనాలు విద్యుత్ కాంతులతో వెలిగిపోతున్నాయి. బుధవారం చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్న సందర్భంగా అధికారులు ఈ ఏర్పాట్లు చేశారు.

వికోట: చంద్రబాబు ముఖ్యమంత్రిగా బుధవారం ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో వీకోట మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు విద్యుత్ దీపాలంకరణలతో పండుగ వాతావరణాన్ని తలపించాయి. జిల్లా అధికారుల ఆదేశాను సారం మండల కేంద్రమైన వీకోటలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలను విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి పచ్చని తోరణాలు కట్టి కార్యాలయాలు ఎదుట రంగురంగుల ముగ్గులతో అలంకరించారు. రాష్ట్రంలో చంద్రబాబు నాయకత్వంలో బుధవారం నుంచి ఏర్పడనున్న నూతన ప్రభుత్వం పేద ధనిక అన్ని వర్గాల సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల్లో మరింత ముందుకెళ్లి సుపరిపాలన కొనసాగాలని స్థానిక ప్రజల ఆకాంక్షిస్తున్నారు.



వీకోటలో

పలమనేరు: పలమనేరు నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు రంగురంగుల కాంతుల వెలుగులతో సర్వాంగ సుంద రంగా అలంక రించారు. బుధవారం చంద్రబాబు సీఎంగా ప్రమాణ స్వీకారం చేయనున్న సందర్భంగా కార్య క్రమాన్ని వీక్షించేందుకు అధికారులు ప్రత్యేక ఏర్పాట్లను ఇప్పటికే పూర్తి చేశారు.

వైభవంగా బాటగంగమ్మ జాతర



ప్రత్యేక అలంకరణలో బాటగంగమ్మ

ప్రజాశక్తి-కార్వేటినగరం: మేజర్ పంచాయతీ కార్వేటినగరంలోని బీకాలనీ సమీపంలో పచ్చికాపల్లం రోడ్డుపై వెలసి ఉన్న శ్రీబాట గంగమ్మ ఆలయంలో మంగళవారం అమ్మవారి జాతరను భక్తులు అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు సుప్రభాత సేవతో మేల్కొలిపి అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని పట్టువస్త్ర సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తులు ఆలయ ఆవరణలో భక్తి శ్రద్ధలతో పొంగళ్లు వండి, పిండి దీపాలు వెలిగించి నైవేద్యం సమర్పించారు. అదే విధంగా మొక్కులున్న భక్తులు అమ్మవారికి కొబ్బరికాయలు, కర్పూరహారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే బీసీ కాలనీ వీధులను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు.

ఎమ్మెల్యే థామస్‌ను కలిసిన నేతలు

ప్రజాశక్తి-వెదురుకుప్పం: టీడీపీ అధినేత చంద్రబాబు ఏపీ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఈ సందర్భంగా ఆ పార్టీ ఎమ్మెల్యేలు ఇప్పటికే విజయవాడ చేరుకున్నారు. వెదురుకుప్పం టీడీపీ నేతలు జీడీ నెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ థామస్‌ను మంగళవారం విజయవాడలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో మోహన్‌మురళి, సుధాకర్ రెడ్డి, గంగయ్య, బి.యం.రవి, సుధకర్, చెంగలపండురెడ్డి, డిల్లీ, హనుమంతురెడ్డి, హరినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.



ఎమ్మెల్యే థామస్‌ను కలిసిన నేతలు

ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార మహోత్సవం

ప్రత్యక్ష ప్రసారం వీక్షించేలా చర్యలు
జిల్లా కలెక్టర్ షన్మోహన్



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ఈనెల 12వ తేదీ బుధవారం గన్నవరం మండలం కేసరపల్లి గ్రామంలోని ఐటి పార్క్ సమీపంలో రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారంలో వీక్షించేందుకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.షన్మోహన్ టెలీకాన్ఫరెన్స్ ద్వారా అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ టెలీకాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకార మహోత్సవ ప్రత్యక్ష ప్రసారం అంశాలకు సంబంధించి ప్రభుత్వ ఆదేశాల మేరకు డివిజనల్, నియోజకవర్గ, మునిసిపల్, మండల స్థాయి అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణస్వీకార మహోత్సవంలో భాగంగా జిల్లాస్థాయిలో నాగయ్య కళాక్షేత్రంలో ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని, పండుగ వాతావరణం ఉట్టిపడేలా ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. దీంతో పాటు ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారం ప్రజలు వీక్షించేలా మండలస్థాయిలో మండల పరిషత్ మీటింగ్ హాల్స్‌లో, కమ్యూనిటి హాల్స్, నియోజకవర్గాల్లో గుర్తించిన పెద్ద హాల్ లేదా కళ్యాణ మండపం, మునిసిపల్ హాల్, తదితర వాటిలో ఏర్పాట్లు చేయాలన్నారు. అలాగే గ్రామ పంచాయతీ స్థాయిలో కమ్యూనిటి హాల్ వంటి వాటిలో ప్రజలు ప్రత్యక్ష ప్రసారం వీక్షించే విధంగా టీవీ, ఇంటర్నెట్, డిష్ ఏర్పాటు ఉండాలని, పండుగ వాతావరణంలో ఈ కార్యక్రమం నిర్వహించాలన్నారు.

అలాగే చిత్తూరు జిల్లాలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాలు, జిల్లా, నియోజకవర్గ, డివిజనల్, మండల రెవెన్యూ కార్యాలయాలు, మండల పరిషత్ కార్యాలయాలు, గ్రామస్థాయి కార్యాలయాలన్ని విద్యుత్ లైటింగ్ ఏర్పాటు పూర్తి చేయాలన్నారు. ఈకార్యక్రమం విజయవంతం చేయడంలో జిల్లాస్థాయి నుండి గ్రామస్థాయి వరకు అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు.

జిల్లాలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ప్రజలను మండల తహశీల్దార్, ఎంపీడీఓలు సంబంధిత శాసనసభ్యులతో సమన్వయం చేసుకొని నియోజకవర్గాన్ని నాలుగు బస్సులు ఏర్పాటుతో విజయవాడకు మంగళవారం రాత్రికి బయలు దేరాయని, జిల్లా నుండి ఏడు నియోజకవర్గాల సంబంధించి 28 బస్సులు బయలుదేరడం జరిగిందని తెలిపారు. ప్రతి బస్సుకు ఒక అధికారిని నియమించి వారిని జాగ్రత్తగా తీసుకువెళ్లడం తోపాటు వారిని తిరిగి స్వస్థలాలకు చేర్చే బాధ్యత అధికారికి అప్పగించడం జరిగిందన్నారు. ఈబాధ్యతను అధికారులు అప్రమత్తంగా నిర్వహించాలన్నారు. డ్వామా పీడీ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నగరంలో ప్రత్యక్ష ప్రసారం ఏర్పాట్లపై కమిషనర్ సమీక్ష

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమాన్ని బుధవారం నగరంలో ప్రత్యక్షప్రసారం నిర్వహణ ఏర్పాట్లపై నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ నగరపాలక అధికారులతో సమీక్ష నిర్వహించారు. మంగళవారం కార్యాలయంలో సహాయ కమిషనర్ రామకష్ణుడు, ఇతర విభాగాల అధికారులతో నిర్వహించిన సమావేశంలో కమిషనర్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు చిత్తూరు నాగయ్య కళాక్షేత్రంలో, గాంధీ సర్కిల్ వద్ద ప్రత్యక్ష ప్రసారానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. నాగయ్య కళాక్షేత్రంలో ఏర్పాట్లు పక్కాగా ఉండాలని ప్రత్యక్ష ప్రసారానికి అవసరమైన అన్ని ఏర్పాట్లను ఇంజనీరింగ్ విభాగం అధికారులు పక్కాగా చేపట్టాలని ఆదేశించారు. పారిశుద్ధ్య నిర్వహణ, నీటి సౌకర్యం, లైటింగ్ ఏర్పాట్లపై అధికారులకు మార్గనిర్దేశం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం ఏర్పాట్లు పక్కాగా చేయాలన్నారు. సమావేశంలో ఎంహెచ్వో డాక్టర్ అనిల్ కుమార్ నాయక్, డీఈఈ వెంకట ప్రసాద్, మేనేజర్ ఉమా మహేశ్వర్ రెడ్డి, సీఎంఎం గోపి, ఇంజనీరింగ్, ప్రజారోగ్య, రెవెన్యూ, టౌన్ ప్లానింగ్, మెప్మా అధికారులు పాల్గొన్నారు.

నాగయ్య కళాక్షేత్రంలో ఏర్పాట్లు పర్యవేక్షణ

నాగయ్య కళాక్షేత్రంలో చేపడుతున్న ఏర్పాట్లను కమిషనర్ డాక్టర్ జె.అరుణ మంగళవారం మధ్యాహ్నం పర్యవేక్షించారు. ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమాన్ని బుధవారం ప్రత్యక్ష ప్రసారం చేయనున్న నేపథ్యంలో నాగయ్య కళాక్షేత్రాన్ని సుందరంగా అలంకరించాలన్నారు. ప్రధాన ద్వారం వద్ద పండుగ వాతావరణాన్ని తలపించేలా తోరణాలు, రంగవల్లులతో సుందరంగా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు. నాగయ్య క్షేత్రంలో చేపట్టాల్సిన ఏర్పాట్లపై సంబంధిత అధికారులకు మార్గనిర్దేశం చేశారు.



అభినయ్‌రెడ్డికి కూటమి చెక్..?

డిప్యూటీ మేయర్‌గా తప్పించే యత్నం



ప్రజాశక్తి - తిరుపతి టౌన్
తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పదవినే కాకుండా, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డినీ ఆ పదవి నుంచి తప్పించడానికి కూటమి ముమ్మర ప్రయత్నాలు చేస్తోంది. భూమన అభినయ్‌రెడ్డి తండ్రి భూమన కరుణాకర్‌రెడ్డి సహకారంతో కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులు నామినేషన్ వేయకుండా అడ్డుకోవడమే గాకుండా, పోలీసులతో దౌర్జన్యాలు చేయించి బెదిరింపులకు గురిచేశారు. నామినేషన్ వేసిన వారిని ఉపసంహరించుకునే వరకూ దాడులకు పాల్పడ్డారు. 50 డివిజన్లలో 49 డివిజన్లకు ఎన్నికలు జరిగాయి. ఏడో డివిజన్ ఎన్నిక కోర్టులో ఉంది. ఏకపక్షంగా ఎన్నికలు జరగడంతో మేయర్‌గా డాక్టర్ శిరీష, డిప్యూటీ మేయర్లుగా భూమన అభినయ్‌రెడ్డి, ముద్రనారాయణలు ఏలుబడి చేశారు. పేరుకు ఇద్దరు డిప్యూటీ మేయర్లుగా ఉన్నా అభినయ్‌రెడ్డి ఆదేశాల మేరకే కార్పొరేషన్ పనులన్నీ జరిగేవన్నది బహిరంగ సత్యం. ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఇళ్లకు కుళాయి, యుడిఎస్ కనెక్షన్లు ఇవ్వకపోవడమే గాకుండా ప్రతిపక్షాలపై ఉక్కుపాదం మోపారన్న అపవాదు మూటగట్టుకున్నారు. మాస్టర్‌ప్లాన్ రోడ్లకు సంబంధించి ప్రతిపక్ష పార్టీలను సంప్రదించకుండానే భూమన అభినయ్‌రెడ్డి సొంత నిర్ణయాలు తీసుకోవడం, భూములు కోల్పోయిన బాధితులకు న్యాయం చేయలేదన్న విమర్శలున్నాయి. టిడిఆర్ బాండ్లలో భారీ అవినీతి జరిగిందని స్వయంగా అప్పటి ప్రతిపక్షమైన టిడిపి భారీ విమర్శలు గుప్పించింది. తిరుపతి అభివృద్ధి పనులు సైతం కమీషన్లు ఇచ్చిన కార్పొరేటర్ల డివిజన్లలోనే చేశారని పనులు చేయని కార్పొరేటర్లు కినుక వహించారు. ప్రతి అభివృద్ధి పనిలోనూ పర్సంటేజీల పేరుతో ఇటు అధికారులు, అటు డిప్యూటీ మేయర్ అనుచరులు లంచాలు తీసుకునే పనులు చేశారన్న ఆరోపణలున్నాయి. ప్రతి పనికి 10శాతం తక్కువ కాకుండా కమీషన్ చెల్లించారని తెలుస్తోంది. చేసిన పనులు కూడా ఇష్టారాజ్యంగా, నాశిరకంగా ఉన్నాయని పనులు జరిగిన తీరును బట్టి అర్ధమవుతోంది. ఇందిరా ప్రియదర్శిని కూరగాయల మార్కెట్ గత ఐదేళ్లుగా భూమన అభినయ్‌రెడ్డి ఎవరి పేరు చెబితే వారికే టెండర్లు ఇవ్వడంతో విచ్చలవిడిగా పన్నుల వసూళ్లు ఇష్టారాజ్యమయ్యింది. తాజాగా కూటమి ప్రభుత్వం భారీ మెజార్టీతో గెలుపొందడం, తిరుపతిలో అత్యధిక మెజార్టీ దక్కించుకుని జనం జనసేనకు పట్టం కట్టిన నేపథ్యంలో తిరుపతి కార్పొరేషన్‌లో కూటమి జెండా ఎగురవేసే విధంగా తెరవెనుక పావులు కదులుతున్నాయి.

బిఆర్ అంబేద్కర్ విశ్వ విద్యాలయాన్ని తరలించొద్దు

ప్రజాశక్తి - సత్యవేడు
సత్యవేడు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు అనుబంధంగా ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ స్టడీ సెంటర్‌ను తిరుపతి ఎస్వీ యూనివర్సిటీకి తరలించవద్దని డివైఎఫ్ఐ నాయకులు టి మురళి డిమాండ్ చేశారు. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపల్ సురేష్ బాబుకు వినతిపత్రం సమర్పించారు. స్టడీసెంటర్‌ను తిరుపతి ఎస్వీ యూనివర్సిటీకి తరలించాలని డైరెక్టర్ ఎల్‌వికె రెడ్డి ఉత్తర్వులను జారీ చేశారు. నాయకులు టి.మురళి మాట్లాడుతూ వెనుకబడిన కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఇంటర్ పూర్తి చేసుకుని ఉన్నతమైన చదువులు చదువుకోలేని వారికి ఈ స్టడీ సెంటర్ ఎంతో ఉపయోగపడుతోందన్నారు. వెనుకబడిన ప్రాంతంలో ఉన్న యూనివర్సిటీని తిరుపతికి తరలించడం అంటే పేద విద్యార్థులకు చదువును దూరం చేయడమేనని అన్నారు. ఈ స్టడీసెంటర్‌లో అధికంగా దళిత గిరిజనులే గత 38 ఏళ్లుగా చదువు కొనసాగిస్తున్నారు. 1986, సెప్టెంబర్ 15వ తేదీన అప్పటి ఎంఎల్ఎ దాస్ చొరవ వల్ల డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సార్వత్రిక స్టడీ సెంటర్ ఏర్పాటయ్యింది. ఇప్పటివరకూ దాదాపు ప్రతి ఏటా 150-160 మంది విద్యార్థులు డిగ్రీ పూర్తి చేసుకుని వెళుతున్నారని గణాంకాలే చెబుతున్నాయి. ఆర్థికంగా వెనకబడి ఉద్యోగాలు చేసుకుంటూ ప్రైవేట్‌గా డిగ్రీ పట్టా పొంది ఉద్యోగోన్నతులు పొందేందుకు ఈ యూనివర్సిటీ ఎంతో ఉపయుక్తంగా ఉందని నిరుద్యోగులు వాపోతున్నారుర. స్టడీసెంటర్‌ను కొనసాగించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల, నిరుద్యోగుల ఆశలను తుంచివేయాలని ప్రయత్నిస్తే విద్యార్థి, ప్రజాసంఘాలతో పోరాడతామన్నారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఆదేశాలు అందిన మాట వాస్తవమేనని, అయితే ఇంకా తరలించలేదని, పై అధికారులకు తెలియజేస్తామని తెలిపారు.





విద్యార్థుల తరఫున వినతిపత్రం ఇస్తున్న నాయకులు



నాణ్యమైన విత్తన ఎంపిక ప్రధానం

ప్రజాశక్తి - క్యాంపస్
ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో పంటలకు సంబంధించిన విత్తనాన్ని ఎంపిక చేసుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన పంటను దిగుబడి చేసుకోవచ్చని శాస్త్రవేత్త డాక్టర్ సి రమణ పేర్కొన్నారు. వ్యవసాయ పరిశోధన స్థానం పెరుమాళ్ళపల్లిలో మంగళవారం ఖరీఫ్ సీజన్ విత్తన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోదుక్కులు వ్యవసాయంలో యాంత్రికరణ ప్రాముఖ్యత గురించి రైతులకు వివరించారు. సబ్ సాయిలర్, ఇతర రకరకాల పనిముట్ల అవసరాలను గురించి ప్రత్యేకంగా వివరించారు. వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఆర్ పి. వాసంతి మాట్లాడుతూ పంటలో అధిక దిగుబడులు సాధించడానికి నాణ్యమైన విత్తన ఎంపిక ఎంతో ఆవశ్యకమని రైతులకు వివరించారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు కెఆర్ ఠాగూర్, డాక్టర్ పిఎం. హేమలత, డాక్టర్ ఎం. శ్రీవల్లి దేవి, చిత్తూరు ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ వై. రెడ్డి రామ్, కషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త శ్రీనివాసులు, కలికిరి కషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త జివిస్ పాండురంగ పాల్గొన్నారు.



ప్రజలు మెచ్చిన నాయకుడు చంద్రబాబు..

ఆయనే.. ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు.. : చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ల ప్రసాదరావు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

ప్రజల మెచ్చిన ప్రజానాయకుడు.. టిడిపి అధినేత, ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాద్ రావు కొనియాడారు. ఆయనే ఏపీ భవిష్యత్తు అని అన్నారు. ఎన్డీఏ శాసన సభాపక్ష నేతగా ఏకగ్రీవంగా ఎన్నుకున్న నారా చంద్రబాబు నాయుడుకి ప్రసాద్‌రావు మంగళవారం శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ప్రసాదరావు మాట్లాడుతూ.. 14ఏళ్ల పాటు ముఖ్యమంత్రిగా, 15 సంవత్సరాల పాటు ప్రతిపక్ష నేతగా అపార అనుభవమున్న నారా చంద్రబాబు నాయుడు నేతత్వంలో ఆంధ్రప్రదేశ్ దిశ తిరుగుతుందని కాంక్షించారు. ఎన్డీఏ శాసనసభాపక్ష నేతగా ఏకగ్రీవంగా ఎన్నికైన తర్వాత బాబు చేసిన తొలి ప్రసంగమే... ఆయన దార్శినికతకు అద్దం పట్టిందన్నారు. ప్రజాసేవకు మారుపేరైన చంద్రబాబు ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పారదర్శకతతో కూడిన పాలనను అందించగలరని విశ్వసిస్తున్నట్లు చెప్పారు. అలాగే ఆంధ్రప్రదేశ్ కూడా అభివద్ధి వైపు నడుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.



నారా లోకేష్‌ను కలసిన జిజేఎం




నారా లోకేష్‌తో చిత్తూరు ఎంఎల్‌ఏ గురజాల జగన్మోహన్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: విజయవాడ కన్వెన్షన్ హాల్లో నిర్వహించిన ఎన్డీఏ కూటమి శాసన సభాపక్ష సమావేశంలో ఎన్డీఏ శాసనసభాపక్ష నేతగా ఎన్నుకున్న అనంతరం చిత్తూరు గురజాల జగన్ మోహన్ తెలుగుదేశం జాతీయ కార్యదర్శి నారా లోకేష్, నారా చంద్రబాబు నాయుడును కలసి ఆత్మీయంగా పలకరించారు.

తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ

దర్శనానికి 12గంటలు



ప్రజాశక్తి- తిరుమల: వేసవి సెలవులు ముగియనుండడంతో తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న భక్తులతో కొండపై ఉన్న 31 కంపార్టుమెంట్లు నిండిపోయాయి. స్వామివారిని 78,064 మంది భక్తులు దర్శించుకోగా 33,869 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీకి రూ.3.70 కోట్లు ఆదాయం వచ్చిందని టీటీడీ అధికారులు వివరించారు. లోకకల్యాణం కోసం శ్రీవారిని ప్రార్థిస్తూ తిరుమలలోని నాదనీరాజనం వేదికపై మంగళవారం 11వ విడత అయోధ్యకాండ అఖండ పారాయణం భక్తులను భక్తిసాగరంలో ముంచెత్తింది. అయోధ్యకాండలోని 40 నుంచి 44వ సర్గ వరకు మొత్తం నాలుగు సర్గల్లో 159 శ్లోకాలు, యోగవాశిష్టం, ధన్వంతరి మహామంత్రంలోని 25 శ్లోకాలు కలిపి మొత్తం 184 శ్లోకాలను పారాయణం చేశారు. ధర్మగిరి వేదపాఠశాల పండితులు డాక్టర్ రామానుజాచార్యులు, అనంత గోపాలకష్ణ, డాక్టర్ మారుతి శ్లోక పారాయణం చేశారు.